క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ



నెల్లూరు (టౌన్) : స్థానిక రంగనాయకులపేటలోని పీఎంఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో కృష్ణ కల్చర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవెంట్స్ నిర్వాహకులు కృష్ణ, మురళి, జయప్రకాష్, ఇంద్రజాలకుడు రాయలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వెబినార్



హాజరైన రైతులు, అధికారులు

నెల్లూరు(అర్బన్) : భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం నిర్వహించిన వెబినార్ సమావేశానికి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రైతులు, వ్యవసాయాధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్ తదితరులు హాజరయ్యారు. ప్రధాని ప్రసంగాన్ని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ రైతులకు వివరించారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ నగదును అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్ శనివారం నగరంలోని పలుచోట్ల పాల్గొన్నారు. వేదాయపాళెం సమీపంలోని న్యూ మిలిటరీ కాలనీలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి కలెక్టర్ చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. వీఆర్వో ప్రమీల, వెల్ఫేర్ సెక్రటరీ మోజఫ్ ఉన్నారు.

వేడుకగా పులివాహన సేవ



నెల్లూరు(బృందావనం) : మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారికి పులివాహన సేవను వేడుకగా నిర్వహించారు. ఉదయం చప్పర ఉత్సవం జరిగింది. స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. చప్పర ఉత్సవం ఉభయకర్తలుగా ఎనమలమంద శ్రీనివాసులు– లక్ష్మి దంపతులు, పులివాహనసేవ ఉభయకర్తలుగా సోమిశెట్టి సుబ్బమ్మ జ్ఞాపకార్థం దేవస్థానం వ్యవహరించింది. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ : నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్ రామలింగాపురంలో సీసీరోడ్డు పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల వ్యవధిలోనే 19వ డివిజన్‌లో రూ.4.37 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జ్యోతి ప్రియ, డివిజన్ నాయకుడు మదన్‌కుమార్ రెడ్డి, జనసేన నాయకుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వైభవంపై ఉపన్యాసం



వరప్రసాద్‌రావుకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి వైభవ ఉపన్యాసాలు శనివారం ముగిశాయి. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి గుడ్లదొన వరప్రసాద్‌రావు మహాశివరాత్రి వైభవంపై ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. అవధాని కోట రాజశేఖర్, అల్లు భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, డి.వెంకటేశ్వరరావు, ఎంఎం.రామయ్య, పి.సుధేష్, వి.శ్రీహరిప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నేర నియంత్రణే లక్ష్యంగా..

- జనార్ధన్‌రెడ్డి కాలనీలో పోలీస్ అవుట్‌పోస్టు
- పనులను పరిశీలించిన నగర డీఎస్పీ



అవుట్ పోస్టు వివరాలను తెలుసుకుంటున్న సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్) : నగరంలో నేర నియంత్రణపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో పోలీసు గస్తీని పెంచారు. నెల్లూరు నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, జనార్ధనరెడ్డికాలనీల్లో తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. మత్తులో యువత ఘర్షణలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను కట్టడిచేయవచ్చని పోలీసు అధికారులు భావించారు. అందులో భాగంగా జనార్ధనరెడ్డికాలనీలోని పంప్‌హౌస్ వద్ద పోలీసు అవుట్‌పోస్టు నిర్మాణ పనులు చేపట్టారు. శనివారం రాత్రి నగర డీఎస్పీ పి.సింధుప్రియ పనులను పరిశీలించి స్థానిక ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషాకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేస్తామన్నారు. పనులు పూర్తికావచ్చాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అవుట్‌పోస్టులో సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు. వెంకటేశ్వరపురం, జనార్ధనరెడ్డికాలనీ, భగత్‌సింగ్‌కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఎలాంటి సమస్యలెదురైనా తక్షణ సాయం కోసం అవుట్ పోస్టును సంప్రదించవచ్చని చెప్పారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు రూరల్ : స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ జిల్లా సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉయ్యాల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పాజర్ల ప్రదీప్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా సీహెచ్ తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా చంద్రకాంత్‌ను నియమించారు. సమావేశంలో అధ్యక్షుడు వేలూరు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చక్రం దినేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి, ట్రెజరర్ సునీల్ గవాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోండి



వైకుంఠపురంలో నిల్వ చేరిన మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో కాలువల ద్వారా మురుగునీటి పారుదల సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక ఐదో డివిజన్ సత్యనారాయణపురం, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లో కమిషనర్ శనివారం పర్యటించారు. కాలువల్లో మురుగునీటి పారుదల సులభతరంగా ఉండేందుకు ఏర్పాటుచేసిన ఐరన్ మెష్‌లు నేలకు సమాంతరంగా ఉండేలా సరి చేయాలన్నారు. వైకుంఠపురం ఎస్టీ కాలనీ వద్ద మురుగు కాలువ నీరును అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సత్యనారాయణపురం పార్కులో ఆట వస్తువులు, జిమ్ పరికరాలను పరిశీలించి, పచ్చదనాన్ని పెంచాల్సిందిగా ఇంజినీరింగ్ ఈఈ రహంతు జానీ, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్‌కు సూచించారు. ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, డీఈఈ రఘురాం, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నెల్లూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఈ మేరకు కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని కౌలు రైతు సంఘం అధ్యక్షుడు ముత్యాల గురునాథం అన్నారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అనుభవం ఉన్న సిబ్బందిని నియమించాలని, తద్వారా రైతుకు మద్దతు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి తుళ్లూరు గోపాల్, పాట్టిపాళెం చంద్రమౌళి, రైతు సంఘం నాయకులు పులిగల శ్రీరాములు, గండవరపు శేషయ్య, బుజ్జయ్య పాల్గొన్నారు.

సంగీత విభావరి నేడు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో 'కృష్ణగాన మంజరి' కర్ణాటక సాంప్రదాయ సంగీత విభావరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరుగనుందని నిర్వాహకుడు దువ్వూరు బెనర్జీ తెలిపారు. నర్తకిసెంటర్‌లోని గానం అకాడమీలో ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీ సంగీత విద్యాలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా సంస్కృత, హిందీ, తమిళ, కన్నడ, మరాఠీ, తెలుగుభాషలకు చెందిన ప్రముఖ వాగ్గేయకారుల భజనలు, నామ సంకీర్తనలు ఉంటాయన్నారు. సంగీత విద్వాంసురాలు అనంతబొట్ల రమాదేవి శిష్య బృందానికి చెందిన 28 మంది విద్యార్థులతో ఘనంగా నిర్వహించనున్నామన్నారు. విద్యాలయ అధినేత్రి అనంతబొట్ల రమాదేవి, సభ్యులు ఏవీఆర్ కిశోర్, రాయప్రోలు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్టూడెంట్ ఫెస్ట్



నెల్లూరు (టౌన్) : స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ లెవల్ స్టూడెంట్ ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, కోడింగ్ కాంటెస్ట్, టెక్నికల్ క్విజ్, టెక్ ఫన్ ఈవెంట్, బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్ తదితర పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ స్టేట్ హౌసింగ్ ప్రాజెక్టు మేనేజర్ వేణుగోపాల్ పాల్గొని, మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజానాయర్, డాక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఏజీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బెగ్గింగ్ మాఫియాపై దాడులు



నెల్లూరు(క్రైమ్) : కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందంగా నగరంలో బెగ్గింగ్ మాఫియాపై దాడులు కొనసాగిస్తున్నారు. గుంతకల్ ప్రాంతానికి చెందిన మహిళలు తమ పిల్లలతో వీఆర్సీ సెంటర్‌లో శనివారం రాత్రి భిక్షాటన చేస్తుండగా డీసీపీఓ సురేష్, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. మహిళలు, పదిమంది పిల్లలను స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. చిన్నారుల చేత భిక్షాటన చేయించడం చట్టరీత్యానేరమని వారు హెచ్చరించారు. అనంతరం మహిళలకు కౌన్సెలింగ్ చేశారు. ఈ దాడుల్లో చిన్నబజారు ఎస్సై అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన ప్రసన్న



నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రాజకీయ అంశాలపై చర్చించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : గృహ విద్యుత్ వినియోగదారులు వారు వాడుకుంటున్న అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. విద్యుత్ భవన్‌లో అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిషనల్ లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో లేదా సబ్‌స్టేషన్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నేత్రదానం



లోకేష్(ఫైల్)

నెల్లూరు(అర్బన్) : నగరంలోని వేదాయపాళెం జ్యోతినగర్‌కు చెందిన విజయనగరం లోకేష్ (25) శనివారం తెల్లవారుజామున తన నివాసంలో మృతిచెందాడు. పుట్టెడు దుఃఖంలో సైతం ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుడు లక్ష్మీనారాయణ ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. లోకేష్ నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించి కుటుంబ సభ్యులను సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు 99595 89321 అనే నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గాంధీ ఆశ్రమంలో 10న వేలంపాటలు

నెల్లూరు(అర్బన్) : రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలోని పొలాల ఫలసాయం పొందేందుకు, అంతర పంటలు పండించుకునేందుకు ఈనెల 10న లీజు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమంలోని 2.14 ఎకరాల్లోని మామిడి, ఇతర ఫల వృక్షాల సాయం పొందేందుకు, అలాగే 1.37 ఎకరాల్లో ఉన్న కొబ్బరితోటలో అంతర పంటలు పండించుకునేందుకు మూడేళ్ల కాల పరిమితికి సంబంధించి బహిరంగ వేలం పాటలు ఇందుకూరుపేట తహసీల్దార్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. వేలంపాటలలో పాల్గొనే వారు ఈనెల 9వ తేదీ ఉదయం 11 గంటల్లోపు పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో రూ.5,000 చెల్లించి రసీదు పొందాలని కోరారు. ఇతర వివరాల కోసం 96400 27128, 96471 08108 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

కేబుల్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : మరమ్మతుల పేరిట అండర్‌గ్రౌండ్ కాపర్ కేబుల్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుని వెళ్లిన ఘటనపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బీఎస్ఎన్ఎల్ అధికారులు నగరంలోని బట్వాడిపాళెం ఎక్స్ఛేంజ్ నుంచి అలంకార్ సెంటర్ వరకు అండర్‌గ్రౌండ్ కేబుల్‌ను ఏర్పాటు చేశారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మరమ్మతులు చేస్తున్నట్లు నటిస్తూ రూ.4 లక్షలు విలువచేసే కాపర్ కేబుల్ (800పెయిర్)ను అపహరించుకుని వెళ్లారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు చోరీ ఘటనపై శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనదని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య అన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఏఎస్పీ శనివారం ప్రారంభించారు. తొలిరోజు మెడికల్ క్యాంప్, ఓపెన్‌హౌస్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తుండడం ద్వారా సమాజం మరింత పురోగమిస్తోందన్నారు. అత్యవసర వేళల్లో 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 8 వరకు మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యతకు సంబంధించిన కార్యక్రమాలు, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే ప్రచారాలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం నారాయణ ఆస్పత్రి వైద్యులు పోలీసు సిబ్బంది, మహిళలు, విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసులు ఉపయోగించే అధునాతన ఆయుధాలు, పరికరాలు, కమ్యూనికేషన్ విభాగ పనితీరు తదితరాలపై అవగాహన కల్పించారు. నగర, ఏఆర్ డీఎస్పీలు పి.సింధుప్రియ, చంద్రమోహన్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, మహిళా పోలీస్‌స్టేషన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు టీవీ సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు రాజారావు, అంకమరావు, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, వైద్యులు మధులేఖ, గులాబీ, దీప్తి, హిమ అనురాగ్, ప్రఖ్య, ప్రసన్న, మంజు, వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

అనుమతుల ప్రకారమే భవన నిర్మాణాలు



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరంలో అనుమతుల ప్రకారమే భవన నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వారాంతపు సమీక్షను కమిషనర్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అన్ని భవన యజమానులకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల కానిదే కుళాయి, డ్రైనేజీ కనెక్షన్లను మంజూరు చేయరాదన్నారు. ట్రాఫిక్‌కు అడ్డంకిగా రోడ్లు, వీధుల్లో నిరుపయోగంగా ఉన్న వాహనాలను ట్రాఫిక్ పోలీస్ వారి సహాయంతో వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ వైఓ నందన్, సిటీ ప్లానర్ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, ప్రకాష్, టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్సీస్ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవసరమైన చర్యలు చేపట్టాలి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు) : రంజాన్ మాసం సందర్భంగా 30 రోజులపాటు ముస్లింల అవసరాలను గుర్తించి అందుకు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్ల ఏర్పాటు, పోలీస్ పికెటింగ్ తదితర సౌకర్యాలను తక్షణమే అందుబాటులో వచ్చే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్ యాదవ్, తహసీన్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటాం



కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు, రైతులు

నెల్లూరు(సెంట్రల్) : వ్యవసాయంలో సలహాలు, సూచనలకు సంబంధించి శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ సుమతి పేర్కొన్నారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి తగినట్లు వ్యవసాయంలో నూతన పద్ధతులు తెలుసుకోవడం ఎంతో మంచిదన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ లలితా శివజ్యోతి మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి రైతులకు ఏమి చేయాలో ఒక ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో మినీకిట్లను ఇస్తున్నామని పేర్కొన్నారు. పంటల్లో తెగుళ్లు వస్తుంటే ముందు జాగ్రత్తలు తీసుకుంటే మొదటి దశలోనే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలకు ప్రతిష్టాత్మక అవార్డు



నెల్లూరు (టౌన్): కొడవలూరు మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయస్థాయి గ్రీన్ స్కూల్ అవార్డు లభించింది. 2024 – 25 సంవత్సరానికి గానూ న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ స్కూల్ ఆడిట్‌కు ఈ పాఠశాల ఎంపికైంది. పర్యావరణహిత కార్యక్రమాల అమలు ఆధారంగా ఈ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ సునీత నారాయణ్ చేతుల మీదుగా అవార్డును ఎన్జీసీ కోఆర్డినేటర్, ఉపాధ్యాయుడు భక్తవత్సల నాయుడు అందుకున్నారు. నార్తురాజుపాళెంలో శనివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆడిట్‌లో పాల్గొన్న ఎనిమిదో తరగతి విద్యార్థులు, సహకారం అందించిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులు ఓబులేష్ అందజేశారు.

అలరించిన సాంస్కృతిక వేడుక



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నెల్లూరు (టౌన్) : స్థానిక సరస్వతీనగర్‌లోని ఏఎంఏ హాల్లో డాక్టర్ కిశోర్‌రత్నం నెక్స్ స్కూల్ విద్యార్థుల నృత్య సాంస్కృతిక వేడుక శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యాలతో అలరించారు. రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతిలు మాట్లాడుతూ ప్రతిఏటా కూచిపూడి, భరత నాట్యాలతో భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో లలిత కళల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఏఓలు తుహీనా, వాణి, సునీల్, ఖాసీం, మేనేజర్లు అజయ్ సింగ్, అశోక్, హెచ్ఎం మణిమాల, ప్రపూర్ణ, శివకుమార్, జాస్మిన్, నాగేంద్ర, మాధవి, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.